విజయం

శ్రీ యఱ్ఱంశెట్టి శాయి

పడగ్గదిలో పందిరిమంచం క్రిందనుంచి పెద్ద పెట్టె బయటకు లాగి దానిముందు స్టూలు వేసుకొని కూర్చుంది రాజ్యం. కొద్దిగా సెంటు వాసనా, కలరాఉండలసువాసనా మిళితమయిపోయి ఓ క్రొత్త పరిమళం పెట్టెలోంచి బయటకు వెలువడుతోంది. ఆ పరిమళానికి వెలలేని విలువున్నది. అది గడచినకొన్నితీయనిపాతరోజులను రాజ్యం ముందుకి నెడుతుంది. జ్ఞాపకాలను కెలికి బయటకు లాగుతుంది. గుండెల్లో పేరుకుపోయిన అశాంతినీ, అసంతృప్తినీ, ఆరిపోయిన కోరికల చీకటినీ – అక్కడే పుట్టి పెరిగి, పెద్దనయి, దారుణంగా హత్యచేయబడుతోన్న ఆశల సంపుటినీ, తాత్కాలికంగా ఆ పెట్టెముందు కూర్చున్నంతసేపు మరపింపజేసి, దూరంగా నెట్టి, మనసుని, వర్షం వచ్చేముందు వీచే చల్లని గాలిలో సంతోషంగా కేరింతాలుకొట్టే—చిన్నపిల్లలా — ఉక్కిరి బిక్కిరి చేసి సంతోషం, తన్మయత్వంలో ముంచి తేలుస్తోంది. ఓ నిమిషం తరువాత పెట్టెలోని బట్టలను కదిలించింది రాజ్యం. పెద్ద పిల్లలిద్దరూ బడికి పోయారు. చిన్నవాళ్లిద్దరూ వసారాలో కూర్చుని కాగితం విమానాన్ని ఎగరవేయడానికి ప్రయత్నిస్తున్నారు. కిటికీలోంచి సాయంసమయపుఎండ రాజ్యం వీపునిండా అలుముకొని, భుజాలమీద కూర్చొని రాజ్యంతోపాటు తనూ పెట్టెలోకి తొంగి చూడ్డానికి ప్రయత్నిస్తోంది.

లోపల పైనే ఉలెన్ సూటు ఉంది దానిని జాగ్రత్తగా రెండు చేతులతో మడత నలగకుండా పట్టుకొని తీసి ప్రక్కన చాపమీద పెట్టింది. కోటు జేబు దగ్గర రెండు మూడు దారపు ముక్కలు అంటుకొని ఉన్నాయి. వాటిని తీసిపారేసింది. ఆ కోటుని అదివరకెన్నిసార్లు చూసినా మళ్లీ చూడాలనిపిస్తుందామెకి. రాజారావు ఆ సూటు ఎన్నోసార్లు ధరించలేదు. ముచ్చటగా మూడుసార్లు — అంతే! మొదటగా పెళ్లిలో. తరవాత ఓసారి సినిమాకి వెళ్లేప్పుడు. ఆఖరిసారి దీపావళి పండగనాడు మామగారింట్లోనూ. పెళ్లిలో విడిదింటికి పెళ్లికొడుకయి కారులో తరలివచ్చినప్పుడు ఆ సూటులో ఉన్నాడతను. అప్పుడే అతన్ని స్పష్టంగా, ఎక్కువసేపు చూపించింది రాజ్యం. పెళ్లి చూపులనాడు అతన్ని పరీక్షగా చూడ్డానికి ధైర్యం లేకపోయింది. సిగ్గు, భయం, ఖంగారు — అన్నీ కూడబలుక్కొని, కలసికట్టుగా ఎదుర్కొని, ఆ కోరికని చిత్తుగా ఓడించేసినయి. పెళ్లిరోజున కారులోంచి దిగి విడిదింటిలోకి నడుస్తున్న అతనూ, అతనితోపాటు అతగాడు ధరించిన కాఫీకలర్‌సూటూ ఆమెకు నచ్చినట్లు గుర్తుగా, అప్పుడు ఆమె కళ్లు బరువుగా, అందంగా కాటుకతోసహా క్రిందకు వ్రాలినయి.

ప్రక్కనేఉన్న ఆమె స్నేహితురాండ్రు చక్కిలిగిలికన్నా ఎక్కువగా మాటలతో పులకరింపజేశారు.

'యుడీసి కుర్రాడు పోజులు బాగానే పెడుతున్నాడోయ్!' అంది శైలజ.

'పాపం! మన రాజ్యం 'దాసోహం' అనేయాల్సిందే అతగాడికి, తప్పదు' అంది శారద జాలిగా మొఖంపెట్టి.

'ఈవిడ మాత్రమేం తక్కువదాతల్లీ, మనం యస్సెల్సీలో ఉన్నప్పుడు ఆ సోంబాబుని తన ఇంటిచుట్టూ గానుగెద్దులా తిప్పించుకోలా?' నవ్వుతో అంది శకుంతల.

'అమ్మా! చెల్లాయ్ విమానం చింపేసింది!' పరిగెత్తుకొంటూవచ్చి అన్నాడు చిరంజీవి.

రాజ్యం జ్ఞాపకాల గూడులోనుంచి బయట పడింది.

'పోనీలే! ఇంకోటి చేసిస్తాను! నువ్వుపోయి ఆడుకో!' అంది వాడితో. చెల్లాయ్‌నేమీ కోప్పడ నందుకు అసంతృప్తిగా బయటకు నడిచాడు చిరంజీవి.

పెట్లో ఓ మూల వెండి సామానుంది. తన పెళ్ళినాటిదది వెండిపళ్ళెం—చెంబు—గంధపుగిన్నె—బొట్టుభరిణె—హారతిపళ్ళెం—పన్నీరుబుడ్డీ—నిండా వివాహంనాటి జ్ఞాపకాలను పులుముకొని కనబడినయి. మరోప్రక్కనుంచీ ఓ ప్లాస్టిక్ కవరు బయటకు తీసిందామె. అందులో నాలుగు రంగుల రాజారావు 'టై'లు ఉన్నయి. వివాహమయిన క్రొత్తలో చాలా రోజులు అవి కట్టుకొన్నాడు రాజారావు. రామరాను వాటివంక చూడడమే మానుకొన్నాడు. కవరుని మూటు ప్రక్కనఉంచి, పెట్లోంచి మూడు చీరెలు బయటకు తీసింది. వాటిల్లో బ్లూరంగుచీరంటే చాలా ఇష్టం తనకు. చీరంతా చిన్నచిన్నజరీపువ్వులు ఎంతో అందంగా అమిరినయి పెళ్లికని తనే విమలపిన్నితో స్వయంగా సెలక్టు చేసుకొంది. మూటనలభై రూపాయలు దాని ఖరీదు. ఆ విషయం గుర్తుకి రాగానే రాజ్యం గుండె ఝల్లుమంది. అంత ఖరీదుపెట్టి అప్పుడు చీర కొనగలిగిందికాని ఇప్పుడు తలుచుకొంటేనే భయమేస్తుంది.

రోజూ కట్టుకోడానికి ఓ సాదాచీర కొనాలంటేనే బ్రహ్మాండమయి పోతోంది. ఆ చీర మడత విప్పి తృప్తిగాచూసి క్రింద ఉంచింది. రెండో చీర కూడా ఖరీదయినదేగాని అదెందుకనో తననెప్పుడూ అంతగా ఆకర్షించలేదు ఎప్పుడో ఏదో శుభ కార్యానికి తప్పితే సాధారణంగా ఈ మూడు చీరలూ ఎప్పుడూ కట్టుకోదు. రెండేళ్ళక్రితం వరకూ ప్రతిసంవత్సరం తమ పెళ్ళయిన రోజుకు గుర్తుగా ఆయన కోరిక మీద బ్లూ చీర కట్టుకొనేది. ఆ రోజు ఇద్దరూ సినిమాకి వెళ్లేవాళ్ళు. ఆ ఒక్కరోజే తమకి పర్వదినంలా గడిచేది. కాని రెండేళ్లనుంచి చేత్రకాని టైలరు కుట్టిన బట్టల్లా జీవితం ఎగుడూ దిగుడుగా తయారయి, ఆ గుర్తునిక్కూడా బలవంతంగా తన అడుగున పడవేసుకొంది. చకచకమంటూ ఎదిగిపోతున్న పిల్లలూ, వాళ్లమ్మానుకొని, పంతంకట్టి, ధీమాగా కొండల్లా పెరిగిపోయిన ధరలూ, వాటితోపాటు ఎదగలేక దిక్కుమొగం వేసుకొని, ఆశగా చూస్తూ నిలబడిపోయిన భర్తజీతం—ఇవన్నీ—తీయని గతాన్నీ—ఆశలు నింపుకొన్న భవిష్యత్తునీ దరిదాపులకు రాకుండా తరిమి, మనసుని కలవరపరచి, ఉక్కిరి బిక్కిరయే ప్రస్తుతాన్ని ముందుకు నెడుతూంటాయి. గోడకు ఉన్న పాత గడియారం నీరసంగా అయిదు గంటలు కొట్టింది. ఖంగారుగా గడియారంవంక చూసింది రాజ్యం.

'అయ్యో! అయిదయిపోయింది. ఆయనొచ్చేస్తారిక. తనింతవరకూ తెమలనే లేదు.'

ఓ చీరను బయటేఉంచి మిగతా సామానంతా పెట్లోకి సర్దేసి, పెట్టె మంచం క్రిందకు తోసి హడావుడిగా హాల్లోకి నడిచిందామె. చంటిది అక్కడే కూర్చుని ఓ చెక్క బొమ్మని నేలకేసి కొడుతూ శాయశక్తులా విరగ్గొట్టటానికి ప్రయత్నిస్తోంది. కాగితం మీద 'అ ఆ'లు వ్రాస్తున్న చిరంజీవినీ, ఆ పిల్లనూ బాత్‌రూంలోకి తీసుకుపోయి అయిదు నిమిషాల్లో స్నానం చేయించేసింది. బలవంతంగా స్నానం చేయించినందుకు నిరసనగా, కొంపలంటుకు పోయినట్లు ఏడ్చేస్తోంది దా పిల్ల. ఏడుపు పట్టించుకోకుండానే, తుండుతో వళ్లు తుడిచేసి, ఇద్దరకూ ఉతికిన బట్టలు వేసేసి చాపమీద కూర్చుండ బెట్టేసింది. ఈ లోగా స్కూలునుంచి పెద్దవాళ్లిద్దరూ వచ్చేశారు.

'త్వరగా స్నానాలు కానియ్యండర్రా! నాన్నారి ఆఫీసులో డ్రామాలకెళ్దాం!' అంది తను వంటిట్లోకి నడుస్తూ.

రమ, శాంత నేను ముందంటే నేను ముందని పందాలేసుకొని బాత్‌రూంలోకి పరిగెత్తేరు. వాళ్లిద్దరూ స్నానం ముగించేసరికి తను కాఫీ తయారు

చేసేసింది రాజ్యం. వాళ్లకు కాఫీలిచ్చి, తమ త్రాగి భర్తకు ఫ్లాస్కులో పోసి ఉంచింది. ఇదంతా గడిచేసరికి అయిదున్నర అయిపోయింది. కొద్దిగా భయం వేసింది రాజ్యానికి.

'ఆయన నీ పాటికి వస్తూనే ఉండుంటారు! అయిదున్నరకల్లా అందర్నీ రడీగా ఉండమని మరీ మరీ చెప్పివెళ్లారు. ఆరున్నరకే ప్రోగ్రామ్ మొదలట.'

స్నానం ముగించేసి చీర కట్టుకొంటూండగా రాజారావు వచ్చాడు. అతన్ని చూసి తనింకా 'రడీ' అవనందుకు ఏమీ అనలేక నవ్వేసింది రాజ్యం.

'నాకు తెలుసు నువ్వింత ఘటికురాలివేనని. నిన్ననికూడా లాభంలేదులే! మీ ఆడజాతి అలాంటిది!' తనూ నవ్వుతూ అన్నాడు రాజారావు.

'నాదేం ఆలస్యం లేదు. అయిదు నిముషాల్లో బయల్దేరగలను. మీరీలోపల కాఫీ త్రాగండి! ఫ్లాస్కులో ఉంది!' అందామె.

అంతా బయల్దేరేసరికి ఇంటిదగ్గరే ఆరున్నర అయిపోయింది. అడ్డదోవవెంబడి నడిచి పది నిముషాల్లోనే కలక్టరాఫీసుకి చేరుకొన్నారు. ఓపెనెయిర్ థియేటరుదగ్గర చాలా హడావుడిగా ఉంది. బయట బోలెడు కార్లు ఆగిఉన్నయి. అప్పటికే ఫంక్షన్ బిగినయిపోయింది. కొద్దిగా రాజ్యంమీద విసుక్కొన్నాడు రాజారావు.

'అసహ్యంగాలేదూ, మన మిలా రావడం?' అన్నాడు ఆమెవంక చూడకుండానే.

వెనుక ఖాళీగాఉన్న కుర్చీల్లో కూర్చున్నారందరూ. మైకు ముందునుంచుని ఒకాయన ఏదో ఇంగ్లీషులో చదువుతున్నాడు. స్టేజిమీద కుర్చీల్లో కూర్చున్నవారివంక చూపిస్తూ 'ఆ సూటు వేసుకొని కూర్చున్నాయనే కలక్టరుగారు' అన్నాడు రాజారావు భార్యతో. రాజ్యం కలెక్టరుగారివంక చూసింది. ఆయన ఓ మః శిలాకాక దేముడిలా అనిపించిందామెకి. నల్లనిసూటులో తెల్లగా మెరసిపోతున్నాడు. వెనుక చేతులుకట్టుకొని అతివినయంగా నిలబడ్డ చిన్నఆఫీసర్లతో ఏదో మాట్లాడుతూ అప్పుడప్పుడూ చిఱునవ్వు నవ్వుతున్నారు. ఆయనప్రక్కన అంత అందంగానూ, ధీమాగానూ ఆయన సతీమణి కూర్చుని ఉంది. ఆమె సన్నగానూ,-నాజూగ్గానూ, తెల్లగానూ ఉంది. చాలా సింపుల్‌గా ఉంది. ఆమె చెవులకు మెఱుపుల్లా మెరుస్తోన్న దిద్దులున్నయి. చెవులను కప్పేస్తూ నల్లనిజుట్టుఉంది. చేతికి చిన్నవజ్రమంత బంగారపురంగు గడియారం ఉంది: ఒకోచేతికి ఒకోబంగారపు గాజుంది. పెదాలను తెలియజేస్తూ ఎఱ్ఱని లిప్‌స్టిక్ ఉంది. మొఖం గులాబీరంగుగా ఉంది. చేతులు కరువయిపోయిన అదేరంగు జాకెట్టుమీద సన్నగా ప్రాకి భుజంమీదనుంచి వెనుకకు తిరిగి అంతమయిపోయింది గులాబీరంగు సిల్కుచీర.

పరీక్షగా ఆమెనే చూస్తోంది రాజ్యం. ఎక్కడో, ఎప్పుడో చూసినట్లున్న ఆమె ముఖం రాజ్యాన్ని ఇరకాటంలో పెట్టింది. ఎక్కడ? ఎప్పుడు? ఆలోచిస్తోంది రాజ్యం. మరోసారి ఆమె ముఖంలోకి చూసింది. ఆ కళ్లు—నవ్వుతోన్న ఆ కళ్లు—ఖచ్చితంగా తనకు పరిచయమున్నవే! గతంలో జ్ఞాపకాల టార్చిలైటువేసి వెతుకుతోంది రాజ్యం—పెళ్లికి ముందు హైస్కూల్లో చదివేప్పుడు—యస్సెల్సీ క్లాసులో—అవును ఆమె ఎవరో కాదు. యస్సెల్సీలో తన క్లాసుమేటు జగదాంబ.

జమీందారుగారమ్మాయి. ఆ సంవత్సరమే మరో ఊర్నుంచివచ్చి తమ స్కూలులో చేరింది.

తనతో బాగా పరిచయంఉంది కూడానూ.

చప్పట్లు మ్రోగినయి. ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చిపడింది రాజ్యం.

జగదాంబ లేచి నుంచుంది. ఆవిడముందు టేబుల్‌మీద రకరకాల పాకెట్లు ఉంచబడినయి.

'ఆటల్లో గెలిచినవాళ్లకి ఆవిడ ఇస్తుంది బహుమతులు' అన్నాడు రాజారావు.

మైకులో పేర్లు వినబడుతున్నయి. ఒక్కొక్కరే వచ్చి హర్షధ్వానాలమధ్య బహుమతి అందుకొని వెళ్ల

సాగేరు. వాళ్ల నమస్కారాలను చిఱునవ్వుతో అందు కొంటోందామె. మైకులో రాజారావు పేరు వినబడింది. లేచి ముందుకువెళ్లి బహుమతి తీసుకొని తిరిగివచ్చాడు అతను. 'చెస్'ఆటలో రెండో బహుమతి వచ్చిందతనికి. పిల్లలు అతను తెచ్చిన ఎయిర్ బాగ్ ని ఆనందంగా చూస్తున్నారు.

రాజ్యానికి ఓ వింత ఆనందంగా ఉంది.

'తన భర్త కదికారిఅయిన కలక్టరుగారి భార్య ఒకప్పుడు తనకి క్లాసుమేటు. ఆ సంగతి అతనికి తెలియజేసేవరకూ ఉండలేకపోయిందామె.'

'ఏమండీ! ఆవిడ...యస్సెల్సీలో నా 'క్లాసు మేట్'అండీ' మెల్లగా అంది.

రాజారావు తమ ముందు కూర్చున్న మిగతా గుమాస్తాల భార్యలవంక చూస్తూ 'ఎవరూ?' అనడిగాడు.

'నేను చెప్పేది కలెక్టరుగారి భార్య సంగతి!'

'ఆ!' అదిరిపోయాడు రాజారావు.

'అవునండీ! పేరు జగదాంబ మా బెంచీలోనే కూర్చునేది. అప్పుడప్పుడు వాళ్ల కారులో తిరిగే వాళ్ళం కూడానూ!'

రాజారావు గుండెలు కాసేపు దడదడ కొట్టు కొన్నాయి. 'ఆమె రాజ్యం క్లాస్‌మేటా?' రాజ్యం అతనివంకే చూస్తూ, గొప్పగా నవ్వుతోంది. అప్పుడు ఆమె అతనికి తన భార్యలాకాకుండా ఓ పెద్దింటి ఆడపడుచులా, వరాలిచ్చేస్తున్న దేవతలా కనబడింది.

ఓ యుడీసీగాడి జీవితంలోకి చొచ్చుకొచ్చేసి, వాడితో కలిసిపోయి, సుఖాలూ, దుఃఖాలూ, సగానికి పంచేసుకొని, పది సంవత్సరాల సంసారాన్ని ఈదు కొచ్చేస్తున్న రాజ్యానికి అంతగొప్పస్నేహితురాలుందా?

బహుమతు లివ్వటం పూర్తయిపోయింది ఓచిన్నహాస్యనాటిక ప్రదర్శన మొదలయింది. జన మంతా హోరున ఘోష పెట్టేస్తూ విరగబడి నవ్వే స్తున్నారు. వాళ్లతోపాటు రాజ్యం, పిల్లలూ అందరూ నవ్వుతున్నారు. కాని రాజారావు కేవీూ కని పించటంలేదు, వినిపించటంలేదు. అతనిని ఆలోచనలు ముసుగులా క్రమ్మేసినయి. నాలుగు పొడవయిన కొమ్మలున్న చెట్టెక్కి నలుగురూ తలో కొమ్మా పంచుకొని చివరికంటా బయల్దేరిన రాజకుమారుల్లా, అతని ఆలోచనలు, కలక్టరుభార్య రాజ్యానికి క్లాస్‌మేటవడంమూలాన లభించబోయే అవకాశాలను చివరికంటా వెళ్లిచూచి తిరిగి వచ్చేస్తున్నయి.

జనగణమన పాడుతోన్నప్పుడు అందరూ లేచి నుంచూంటుంటే తను ఉలిక్కిపడి లేచినుంచున్నాడు రాజారావు. అందరూ ఇళ్లకు తిరుగు మొఖం పట్టేరు.

భోజనాలు ముగించి గదిలో మంచంమీద పడుకొన్నాడు రాజారావు. పిల్లలందరూ హాల్లో పడు కొని తాము చూచిన నాటిక గురించి ఒకళ్ల మాటలు మరొకరు వినిపించుకోకుండా మాట్లాడేస్తున్నారు. పదకొండయేసరికి ఒకళ్లొకళ్లే అందరూ నిద్ర పోయారు. రాజారావు ఇంకా ఆలోచిస్తూనే ఉన్నా డప్పటికి. గదిలో బెడ్‌లైటు అవసానదశలో ఉన్నట్లు వెలుగుతోంది. ప్రక్కనే నిద్రలోకి జారుతున్న రాజ్యం వంక చూశాడతను. ఓ క్షణమాగి మెల్లగా 'రాజ్యం' అని పిలిచాడు.

'ఊఁ' అంది రాజ్యం నిద్రమత్తుతో.

'నిద్రవస్తోందా?'

'ఊఁ! ఏం కావాలి?' బలవంతంగా కళ్లు తెరచి అతనివంక చూస్తూ అడిగిందామె.

జవాబేమీ చెప్పకుండా ఆమెవంకే కాసేపు చూశాడతను.

'ఏమిటలా చూస్తున్నారు!' నవ్వుతూ అడిగిం దామె.

'కలెక్టరుగారిభార్య నీకు ఫ్రెండన్నావుకదూ?'

'బావుందండీ! ఇంత అర్ధరాత్రప్పుడు అడుగు తున్నారా?' అంది పరిహాసంగా.

'ఆవిడ నీతో ఎలా మెలిగేది? ప్రాణస్నేహితు రాలేనా?'

'ఆ! మరీ అంత ప్రాణమేం కాదుగానీ, ఫరవా లేదు. చనువుగానే ఉండేది. అయినా ఇప్పుడెందుకొచ్చిందా అనుమానం?'

రాజారావు చిన్నగా నవ్వేడు 'అవసరం వచ్చింది.'

'ఏమిటది?' ఆశ్చర్యంగా అడిగింది రాజ్యం. ఆమె నిద్రమత్తంతా వదిలిపోయింది.

'నువ్వోసారి వాళ్ళింటికి వెళ్ళాలి?'

'ఎందుకూ?'

'మీ క్లాస్మేటన్నావు గదా! మామూలుగా కలుసుకోకూడదా?'

'బావుంది! మా ఇద్దరికీ లేని బెంగ మీకు పట్టుకొందే పాపం!'

'అది కాదు రాజ్యం! నువ్వు ఆవిడతో చెప్పి కలెక్టరుగారికి రికమెండ్ చేయిస్తే నాకు ప్రమోషన్ దొరికిపోతుంది. లేపోతే ఈ పెరిగే ఖర్చుతో మన సంసారం అధోగతి పాలవుతుందేమో భయంగా ఉంది. పైన మనవాడెవ్వడూ లేపోవటంవల్ల నాకంటె జూనియర్లు కూడా ప్రమోషన్ సంపాదించేశారు. ఇప్పుడీ అవకాశం మనం ఉపయోగించుకోంటే తప్పేముంది? కలెక్టరుగారికి బోర్డులో కూడా మంచి ఇన్‌ఫ్లూయెన్స్ ఉందిట.

ఈ ఆలోచన ఆమెకు కూడా బాగానే ఉన్నట్లు తోచింది. కాని ఇదంతా అనుకొన్నట్లు జరుగుతుందా అనే అనుమానం ఆమెని పీడించసాగింది. జగదాంబ కొంచెం గర్విష్టి అనే చెప్పుకోవాలి. తనూ, శైలజా, శారదా అందరూ చాలాసార్లు ఆ విషయం గురించి మాట్లాడుకొనే వాళ్ళు. తామందరూ మధ్యతరగతి వాళ్ళు. అంచేత తమలేమిని మాటల్లో, ఏదో విషయంలో పైకిలాగి చూపిస్తూండేది జగదాంబ. అందుకని ఎంత స్నేహంగా ఉన్నా ఆమె అంటే ఎవరికీ ఇష్టంగా ఉండేదికాదు. ఇప్పుడు తను ఆవిడ దగ్గరకు భర్త గురించివెళ్తే ఆవిడ తనని తేలికచేసి మాట్లాడినా సహించగలగాలి. అందుకు తనకి బోలెడు ఓర్పుకావాలి. ఆవిడ మాట్లాడే ప్రతిమాటా నిజమని అనాలి తన వ్యక్తిత్వాన్ని ఆ కాసేపు చంపేసుకోవాలి? ఇది సాధ్యమేనా?

'ఏమిటాలోచిస్తున్నావ్? పోనీ, ఇష్టంలేపోతే వెళ్ళొద్దులే!' రాజారావు ఆమె కళ్ళల్లోకి చూస్తూ మెల్లగా అన్నాడు.

'అబ్బే! ఇష్టం లేపోటాని కేముందనీ! వెళ్తాను!' అతని కనుమానం రాకుండా ఉండటానికి వెంటనే జవాబిచ్చిందామె. భర్తకి కనీసం ఈమాత్రమయినా సహాయం చేయలేకపోతే తనింకా ఆయన కోసం చేయగలిగిం దేముందనీ!

'ఎప్పుడు వెళ్ళమంటారు?' కాసేపాగి అడిగింది రాజ్యం.

'నీ యిష్టం! ఎంత త్వరగావెళ్తే అంత మంచిది. పోనీ రేపే వెళ్ళరాదూ. ఆదివారం కూడానూ!'

'అలాగే! ప్రొద్దున్నే వెళ్ళొచ్చేస్తాను!' అందామె. ఆ తరువాతకూడా ఏవేవో ఆలోచనలతో ఇద్దరకూ ఆలస్యంగా నిద్రపట్టింది.

చాలా త్వరగా తెల్లారిందా రోజు. ఉదయం నుంచీ రాజారావు రాజ్యాన్ని తొందరపెడుతూనే ఉన్నాడు. ఆమెకి అన్నిపనుల్లోనూ సాయం చేస్తున్నాడు.

'వంటపని వచ్చి చూసుకోవచ్చులే! అంతగా కాకపోతే ఓ పూట కారియర్ తీసుకొస్తాను. ముందు నువ్ కాఫీ టిఫిన్ ముగించి రెడీ అవ్!' అంటూ పురమాయించాడు. అలాగే వప్పుకొని ఎనిమిదిన్నర కల్లా తయారయిపోయింది రాజ్యం. పెళ్ళిలో ఎవరో ప్రెజంట్ చేసిన ఓ చక్కని మనీపర్స్ తీసి బయట పెట్టింది.

'అందులో ఏమయినా చిల్లరుంచండి రిక్షా వాడికి...' అందతనితో.

'రిక్షా ఎందుకు, కనకం గాడిని జట్కా తీసుకు రమ్మన్నాను. వాడయితే ఎంతసేపయినా గొణక్కుండా బయట కూర్చొని నిన్ను మళ్ళీ తీసుకొచ్చేస్తాడు...' తనదగ్గరున్న ఆఖరి రెండ్రూపాయలూ పర్సులో ఉంచుతూ అన్నాడతను. ఆమె

మరికొంత చిల్లర ప్రోగుచేసి పర్సులో వేసుకొంది. కనకం జట్కాబండీ వచ్చేసరికి తొమ్మిదయిపోయింది. అంతలోపల రాజారావు నాలుగుసార్లు బండికోసం పిల్లల్ని పరుగులెత్తించేడు.

బండెక్కబోతూ 'అరె. చెప్పులు బాగాలేవండీ, అతుకు అసహ్యంగా కనబడుతోంది. ప్రక్కింటి వదినెగారినడిగి వేసుకొస్తానుండండి!' అంటూ వాటిని లోపలకు విసిరేసి ప్రక్కింట్లోకి నడిచింది.

'అబ్బ! ఇంకా ఆలస్యంచేయకు. పది దాటి వాళ్లింటికి వెళ్లటం అంత బావుండదు...' అన్నాడతను. ప్రక్కింటి వదినగారి చెప్పులేసుకొని తిరిగి వచ్చింది రాజ్యం.

'మీా కెప్పట్నుంచో చెపుతున్నాను ఒక్కజత చెప్పులు కొనండీఅని' వింటేనా? అసహ్యంగా చెప్పులు కూడా అడుక్కోవాల్సివచ్చింది......'విసుక్కొంటూ బండి ఎక్కింది రాజ్యం పిల్లలు అందరూవచ్చి బండివగ్గర నుంచున్నారు. చంటిది ఏడుపు మొదలు పెట్టింది తననుకూడా తీసుకువెళ్లమంటూ.

'వెళ్తానండీ!'అంది రాజ్యం. బండి కదిలింది.

'వెళ్లిరా!' అన్నాడు రాజారావు 'విష్ యూ బెస్ట్ ఆఫ్ ది లక్' అనుకొన్నాడు మనసులో. లోపలకి పిల్లలందరినీ తీసుకొచ్చాడు.

'చాక్లెట్లు కొనుక్కొచ్చి దానికి తినిపించండే! ఇల్లెగిరిపోయేట్లుంది దీని ఏడుపుతో!' అన్నాడు పెద్దపిల్లకి పావలా ఇస్తూ. అతనికి చాలా సంతోషంగా ఉందప్పుడు. తనని తప్పకుండా అదృష్టదేవత వరిస్తుం దిహను. రాజ్యం జగదాంబ మంచిఫ్రెండ్స్. పదేళ్లతరువాత కనబడి ఓ సహాయంచేయమని ఒకప్పటి క్లాస్‌మేట్, మంచిస్నేహితురాలూ అడుగుతోంటే ఎవరు కాదనగలరు? తప్పక అంగీకరిస్తుంది భర్తతో చెప్తుంది. కలక్టరు మామూలు యొల్ప్రకారం భార్యమాట వినితీరతాడు వినేసి మళ్లీ తనపైన వాళ్లకి వినిపిస్తాడు. వాళ్లు వెంటనే ఆర్డర్సు పంపిస్తారు అంతే! ఓసారి తను ఆ మెట్టు ఎక్కాడంటే మెల్లమెల్లగా మెట్లన్నీ ఎక్కేయొచ్చు.

'రాజారావ్.'

బయటనుంచి ఎవరిదో గొంతు వినిపించింది. లేచి బయటికొచ్చాడు రాజారావు చంద్రశేఖర్ నిలబడి ఉన్నాడక్కడ అతని చేతిలో కాయగూరలసంచి ఉంది.

'రావోయ్ లోపలకు!' అన్నాడు రాజారావు.

అతను లోపలికొచ్చి కూర్చున్నాడు చంద్రశేఖర్, రాజారావు చాలాకాలం సెటిల్‌మెంటులో కలసి పనిచేశారు. ఆ డిపార్టుమెంటు తీసేసింతర్వాత చెరో డిపార్టుమెంటుకి బదిలీ అయిపోయారు. మాటల్లో అతను అడిగాడు, 'అవునోయ్, నీ ప్రమోషన్ మాటేమిటి! ఈసారి లిస్టులోనయినా నీ పేరు ఉంటుందా?'

'ఆ సారి రావాలనే అనుకొంటున్నాను. నమ్మకం ఉంది!' అన్నాడు రాజారావు

'ఏం? హైద్రాబాద్‌పోయి ఏమయినా ప్రసాదం పంచేవేమిటి?' నవ్వుతూ అన్నాడు చంద్రశేఖరం.

'ఏం అక్కర్లేదు! అడ్డమయిన వాడూ రికమండేషన్లు పెట్టేసి దూకేస్తుండగాలేంది, ఇక నేనేమిటి ఊరుకొనేది? ఇన్నాళ్లూ ఇష్టంలేగ్గాని లేపోతే నేనూ ఎప్పుడో తగిలించేవాణ్ణి, కాని ఎన్నాళ్లూరుకోవటం. జూనియర్‌గాళ్లందరూ మనని ప్రక్కకినెట్టి పరిగెత్తుకుపోతున్నారు. నేను తల్చుకొంటే వాళ్ల బాబుల్లాంటి రికమండేషన్లు పుట్టించగలను. అందాకా ఎందుకూ? నిమిషాల్లో కలక్టరుగారు నా గురించి ట్రంక్‌కాల్లో బోర్డుకి రికమెండ్ చేసేట్లుచేయగలను.'

'మన కలెక్టరుగారితోనా?' ఆశ్చర్యంగా అడిగాడతను.

'అవును పెద్ద గొప్పేముందని! ఆయన భార్యా నా భార్యా హైస్కూల్లో క్లాస్‌మేట్సు. ఒకరికొకరు ప్రాణం పెట్టేసుకొనేంత స్నేహం...'

కాసేపాగి 'నేనిక వెళ్తాను' అని వెళ్లిపోయాడు చంద్రశేఖరం.

రాజారావు ఇంకా రాజ్యం గురించి ఆలోచిస్తుండగానే రాజ్యం జట్కాలో కలెక్టరుగారిల్లు చేరుకొంది. బండి దిగి కొంచెం బెరుగ్గానే భవనం వేపుకి నడిచింది. అది మొదటిసారి ఆ భవనానికి రావడం. అదీ ఒఖర్తి — ఎప్పుడూ పాండురంగడి గుడికి వెళ్తూ రోడ్డు మీదనుంచి చూడ్డమే! ఓ కుక్క వెనుక పూలతోటలోనుంచి మొరుగుతోంది.

'ఎవరు కావాలమ్మా!' ప్యూన్ ఆమె దగ్గరకొచ్చి అడిగాడు వినయంగా.

'కలక్టరుగారి భార్యను కలుసుకోవాలి!'

'రండి!' అంటూ లోపలకు నడిచాడతను ఓ గదిలోకి నడిచి 'ఇక్కడ కూర్చోండి! ఇప్పుడే అమ్మగారికి చెప్పివస్తాను. తమరెవరని అడిగితే ఏం చెప్పాలి?' అన్నాడు సంశయంగా.

'రాజ్యం వచ్చిందని చెప్పు. ఆవిడ గ్రహిస్తుందిలే!'

ఆతను లోపలి కెళ్లాడు. అక్కడ ఖాళీగా ఉన్న ఓ కుర్చీలో కూర్చుంది రాజ్యం. 'విజిటర్స్' అని వ్రాసిన బోర్డు ఉందా గదిముందు. రెండు నిమషాల తరువాత ప్యూను తిరిగివచ్చాడు

'అమ్మగారు రమ్మంటున్నారు!' ముందుకి దారితీశాడతను. రాజ్యం ఆతన్ని అనుసరించింది లోపలి పెద్ద హాలు. చాలా అందంగా అలంకరించబడి వుంది. ఖరీదయిన ఫర్నిచరూ, గోడలకు మెరుస్తోన్న ఇంగ్లీష్ రంగులూ — క్రింద ఎఱని తివాచీ — కళ్లు చెదురుతున్నయి.

మధ్యలో ఓ సోఫాలో కూర్చుని ఉంది జగదాంబ. ఏదో ఇంగ్లీష్ నవల చదువుతోంది. పుస్తకం ప్రక్కనపెట్టి రాజ్యం వంక పరీక్షగా చూసిందామె. రాజ్యం ఆమె వంక చూసి చిన్నగా నవ్వింది.

'గుర్తు పట్టలేదా జగదాంబా!' అంది దగ్గరగా నడిచి మందహాసంతో.

'నువ్వా! చంపేశావ్! రాజ్యం అంటే ఎవరా అని ఆలోచిస్తున్నాను. బావుంది. కూర్చో ... అలా నిలబడిపోయావేం? ఇప్పుడెక్కడ ఉండటం? ఏమిటి? ... హైస్కూలు వదిలిం తర్వాత మనం ఇదే కలుసుకోవటమనుకొంటాను. ఫిఫ్టి ఎయిట్ మార్చికి వెళ్లాం మనం. అంటే అప్పుడే పదకొండేళ్లయిపోయిందన్న మాట... తమాషాగా లేదూ?'

ఉత్సాహంగా అందామె.

రాజ్యం గట్టిగా నవ్వేసింది. 'అవును! ఆశ్చర్యంగా వుంది. రోజులంత త్వరగా ఎలా గడిచినయ్యో తలుచుకొంటే!'.

'నీ పేరే మర్చిపోయాననలు. ప్యూను వచ్చి ఎవరో ఒకామె మీ కోసం వచ్చారని చెబితే, బహుశా ఏ ధర్మంకోసమో, విరాళంకోసమో వచ్చి ఉంటారనుకొన్నాను ఎందుకంటే ఎప్పుడూ ఎవ్వరోకళ్లు అందుకు తయారవుతుంటారు పెద్ద హెడేక్ అయిపోయిందనుకో!'.

శబ్దరత్నాకరము

అకారాది ఆంధ్ర నిఘంటువు

బహుజనపల్లి సీతారామాచార్యులచే
వ్రాయబడినది.

పరిష్కర్త - అనుబంధకర్త
విద్యారత్న నిడదవోలు వేంకటరావు

చెన్నపట్నపు దేశభాషా గ్రంథకరణ
సభ వారిచే ప్రచురింపబడినది.

వెల : రూ. 30

పునరుమ్మద్రించబడి, ప్రతులు
అమ్మకమునకు సిద్ధముగా నున్నవి

CHRISTIAN LITERATURE
SOCIETY,
P. O. Box 501, Park Town,
MADRAS-3.

రాజ్యం ఉక్కిరిబిక్కిరయింది. ఆ మాటలు తన నుద్దేశించి అనకపోయినా తనని ఎద్దేవాచేసినట్లు అనిపిస్తోన్నాయి.

'ఇది చాలనట్లు మొన్న ఆయన ఆఫీసులో పనిచేసే ఓ గుమాస్తా ఏదో తప్పుచేసి దొరికిపోయాట్ట. అతనిమీద ఏక్షన్ తీసుకోవద్దని అతని భార్య ఇక్కడికొచ్చి నా కాళ్ళమీద పడిపోయింది. వదిలించుకొనేప్పటికి ప్రాణంమీదకొచ్చిందనుకో!'

ప్యూన్ ఇద్దరకూ రెండు గ్లాసుల్లో కూల్ డ్రింకులు తీసుకొచ్చి ఇచ్చేడు.

రాజ్యానికి ఆమె మాటలు వింటోంటే కంపర మెత్తినట్లుంది. 'రాకుండా ఉండాల్సింది' అని అప్పటి కప్పుడే నాలుగయిదుసార్లు అనుకొంది.

'మీ ఆయనేం చేస్తారూ...ఎక్కడో గుమాస్తా అని నీ పెళ్ళప్పుడు ఎవరో చెప్పారు! కదూ?'.

'రాజ్యానికి ఆమె ప్రశ్న తల కొట్టేసినట్లని పించింది. గుమాస్తా అంటే జగదాంబ దృష్టిలో అతి దారుణమయిన చిన్న ఉద్యోగంలా కన్పిస్తోంది. కొద్దిగా ఉక్రోషం వచ్చిందామెకి. కాని తమాయించుకొని ఏమీ జవాబివ్వకుండానే ఊరుకుండిపోయింది.

'ఆ డ్రింక్ తీసుకో! బిస్కెట్స్ అయిపోయి నట్లున్నాయి. ఏదీ, గెస్ట్స్ బాగా ఎక్కువయి పోయారు. నెలకు మూడొందలు అతిధులకే ఖర్చవు తుంది మాకు. పాపం తక్కువ జీతాలు తీసుకొనే మిగతావాళ్లలా గడుపుకొంటున్నారో అర్థం కాదు నాకు. వాళ్ళ కిలాంటి ఖర్చులేమీ బహుశా ఉండవేమో కదూ!'

ఏమీ జవాబివ్వలేదు రాజ్యం. చిరునవ్వు నవ్వి ఊరుకొంది.

'నాకిప్పుడేమీ వద్దు!' అంది డ్రింక్ తీసుకోకుండానే.

'ఫరవాలేదు. ఎండలోపడి వచ్చావు. చల్లగా వుంటుంది రిఫ్రిజిరేటర్‌లో ఉంచిందది. ఇంత చల్లగా ఎప్పుడూ తాగి ఉండవు! పాపం! మీ లాంటి వాళ్లకెలా గడుస్తోందో కాని, రిఫ్రిజరేటర్ లేకపోతే మా యింట్లో ఒక్కరోజయినా గడవదేమో అనిపిస్తుంది.'

'మా ఇంట్లోనూ ఉందది!' అంది రాజ్యం ఆకస్మాత్తుగా, అనాలోచితంగా.

జగదాంబ ఆశ్చర్యపోయింది 'అలానా!... అవును...లేపోతే చాలా కష్టం మరి...' అంటూ సర్దుకొంది.

రాజ్యానికి కాసేపటివరకూ గుండెలు వేగంగా కొట్టుకొన్నాయి. తక్కున ఎలా అబద్దం చెప్పగలిగిందో ఆశ్చర్యంగా ఉంది. కానీ తన జవాబుని తన మనసు హర్షిస్తోంది.

జగదాంబని సరయినచోట దెబ్బకొట్టింది తను. ఇక వదలగూడదు. తనెందుకు చిన్నచూపు చూడ బడాలి? ఆమే స్త్రీయే! తనూ స్త్రీయే! ఆమె గొప్పదయినంతమాత్రాన ఎదుటివాళ్లను కించపరచా లని ఎక్కడుంది? తనకిమాత్రం వ్యక్తిత్వంలేదూ?

'పొద్దుట్నుంచీ ఏవీ తోచటంలేదనుకో! ఆయన ఆఫీసు జీపు చెడిపోయిందని మా కారులో కాంపుకి వెళ్లిపోయారు. కారు లేపోతే ఎక్కడికి వెళ్ల టానికీ కుదరదు...కట్టేసినట్లుంది!' కాసేపాగి అంది జగదాంబ.

'అలాగా! మావారు కారు ఎప్పుడూ నాకోసం వదిలివెళ్లిపోతారు. అసలాయనకి కారు అవసరమేలేదు. నెలకి నాలుగయిదుసార్లు ప్లేనులోనే బొంబే వెళ్తారు.........' జగదాంబ దెబ్బతిన్నట్లు రాజ్యం వంక చూసింది.

'ఇంతకూ విగావరేం చేస్తారో చెప్పావుకాదు!' అంది నెమ్మదిగా.

'బొంబేలో పెద్దబట్టలమిల్లులో షేర్లున్నాయి ఆయనకి ఆ బిజినెసే చూస్తూంటారుకూడా! వచ్చే నెలలో కంపెనీ ఖర్చుమీదే మేము అమెరికా వెళ్తున్నాం!'

ఓ నవలలోచదివిన సంఘటనలు గుర్తుతెచ్చు కొంటూఅంది రాజ్యం.

'ఆ!' విచిత్రంగా నమ్మలేనట్లు చూసింది జగదాంబ.

రాజ్యానికి నవ్వు వచ్చింది. చాలా గర్వంకూడా కలిగింది.

'ఈ విజయం చాలు తనకు! మరోసారి ఎవ్వరినీ కించపరచటానికి జగదాంబ సాహసించదు.'

'ఆ మధ్యనోరోజు నేనూ మావారూ కారులో గుడికి వెళ్తాంటే నువ్వు మీ బంగాళాముందు నుంచునిఉండటం చూశాను. దూరాన్నుంచే నిన్ను గుర్తుపట్టాను. అప్పుడే తెలిసింది నాకు నువ్విక్కడున్నట్లు. తరువాత ఒకటిరెండుసార్లు మీ శ్రీవారు మా ఆయనదగ్గరకొచ్చారట ఏదో పనుండి మావారికి కేంద్రమంత్రులు అందరితో మంచిపరిచయం ఉందిలే. అందుకని చాలామంది వచ్చిపోతూంటారు మా యింటికి..........'

జగదాంబకు మాటలు రావడంలేదు. ఆమె మొఖం వాడిపోయింది.

'మరి నువ్వు క్లబ్బులో చేరలేదా?' అడిగింది.

'ఛ! అలాంటివి మావారి కిష్టం ఉండదు సరే! ఇక నేను వెళ్తాను! మా యింటికోసారి రా నువ్వు! కారు పంపుతాను రేపో ఎల్లుండో! వీలయితే మీ శ్రీవారిని కూడా తీసుకురా! అందరం మా ఎస్టేట్స్‌కి వెళ్దాం! పిక్నిక్ ఏర్పాటుచేస్తాను. ఆఫీసు ఫైళ్లతో మునిగి తేలే మీ వారికి కొంచెం రిలీఫ్‌గాకూడా ఉంటుంది!'. బయటకు నడిచింది రాజ్యం. జగదాంబ ఆమెతోపాటు బయటకు వచ్చింది. ఆమె ముఖంలో కత్తివాటుకి నెత్తురు చుక్కలేదు.

'కారులో రాలేదా?' చుట్టూ చూస్తూ అడిగింది జగదాంబ.

'ఊహూ! లేదు. కారులో అమ్మాయి వాళ్ల ఫ్రెండింటికి వెళ్లింది. దగ్గరేగదాని మా గుఱ్ఱబ్బండీలో వచ్చేశాను. ఇది మా సొంతబండే! బోలెడు మంది అతిథులొస్తుంటారుగదా, వాళ్లకి పనికొస్తుందని కొనిపడేశారు ఆయన...'

బండి ఎక్కి కూర్చుందామె. వెంటనే ముందుకి కదిలింది బండి.

'వెళ్తాను! కారు పంపించగానే తప్పకుండా రా!' అంది రాజ్యం.

జగదాంబ విసురుగా వెనక్కు తిరిగి లోపలకు నడిచింది.

బండిలో కూర్చుని కాసేపటివరకూ మామూలు మనిషి కాలేక పోయింది రాజ్యం. తను అక్కడకు వచ్చిన కారణమేమిటో, తనుచేసిన పని ఏమిటో తలుచుకొంటే దుఃఖం ఆగలేదామెకి. క్షణికావేశంలో జగదాంబను జయించటానికి, చిత్తుచేసేయడానికీ, గొప్పలు సగర్వంగా చెప్పింది తను. తను ఎన్నడూ, కనీ, వినీ ఎఱుగని విషయాల గురించి అనుభవంలో ఉన్నట్లు మాట్లాడింది. జగదాంబను చిన్నబుచ్చింది. అక్కడితో ఆగక ఆమె భర్తనుకూడా పరోక్షంగా అవమాన పరచింది.

బండి ఆమె ఇంటిముందాగింది. దిగి బండి అతనికి డబ్బులిచ్చిలోనికి వడివడిగా నడిచింది రాజ్యం. రాజారావు గడపలోనే ఆమెకోసం ఆత్రుతగా ఎదురు చూస్తూ నుంచున్నాడు.

'ఏమయింది?...' నవ్వుతూ అడిగాడతను.

అతనితో ఏమీ మాట్లాడకుండానే గదిలోకి నడిచిందామె. ఆమె వెనుకే అతనూ వెళ్ళాడు.

'విశేషాలు చెప్పు...' దగ్గరగా వెళ్లి అడిగాడు.

అతని గుండెలమీద వాలిపోయి వెక్కివెక్కి ఏడవటం మొదలు పెట్టింది రాజ్యం. రాజారావు ఈ హఠాత్పరిణామానికి నివ్వెఱపోయాడు.

'వద్దండీ! ఇంకెప్పుడూ ఎక్కడికీ వెళ్లను నేను. మనకి ఎవరి సహాయమూ అక్కర్లేదు. భగవంతుడు మనకి తోడుంటే చాలు. మనకి తిండికి కరువయినా ఫరవాలేదు. కాని మిమ్మల్ని మా స్నేహితురాండ్రముందు తక్కువగా చూపుకొని, వాళ్లసహాయం దేవురించటం నావల్లకాదు. మనకీ కొంచెం ఆత్మగౌరవం వుంది...'

రాజారావు బిగ్గరగా నవ్వేశాడు. జరిగిందంతా ఊహించుకోడానికి ప్రయత్నిస్తున్నాడతను

'పోనీలే! దీనికింత హైరాన ఎందుకూ? ఆవిడ మనకి సహాయం చేస్తుందని మనం కలలు కనేయలేదు కదా! పద భోజనానికి! పిల్లలందరూ ఎదురు చూస్తున్నారు...' ఆప్యాయంగా ఆమె వీపు నిమురుతూ అన్నాడు.